03112024-MAI-04_Layout 1 11/3/2024 2:38 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

విజయ్ కళగం నిలిచి గెలిచేనా?

నాంచారయ్య మెరుగుమాల

'విజయ్ తన పార్టీ ప్రారంభ మహాసభ చాలా, చక్కగా విజయవంతంగా నిర్వహించాడు. అతనికి శుభాకాంక్షలు'.. తమిళ టాప్ హీరో, 'దళపతి' విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే)పై తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ క్లుప్తంగా చేసిన గొప్ప కామెంట్ ఇది. తమిళ సినీ నిర్మాత, దర్శకుడు ఎస్.ఎ. చంద్రశేఖర్, సినీ నేపథ్య గాయని శోభ కుమారుడైన 50 ఏండ్ల విజయ్ జోసెఫ్ చంద్రశేఖర్ ఉరఫ్ విజయ్ పెట్టిన మరో ద్రవిడ పక్షంపై ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. తమిళనాడు రాజకీయ సంప్రదాయాలూ, ఆచారాలే అందుకు కారణం. ఐదు దశాబ్దాలుగా (1971-2021 అసెంబ్లీ ఎన్నికల వరకు) తమిళనాట అధికారం అన్నాడీఎంకే, డీఎంకే మధ్య బదిలీ అయ్యే ఆనవాయితీ టీవీకే స్థాపనతో మారిపోతుందా? లేక మరో తమిళ హీరో విజయకాంత్ స్థాపించిన డీఎండీకే మాదిరిగా మొదట మెరిసి చివరకు మాయమైపోతుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు తమిళ రాజకీయ విశ్లేషకులకు ఎదురవుతున్నాయి.

పీఆర్పీ కావచ్చు లేదా రజనీకాంత్ మొదలుపెట్టి, నిలిపివేసిన రాజకీయ పార్టీ మక్కల్ సేవయ్ కచ్చి (ఎంఎస్‌కే) కావచ్చు.. వాటి ప్రారంభాలు ఘనంగానే ఉంటాయి. అదే తరహాలో విల్లుపురం జిల్లా విక్రవండిలో జరిగిన టీవీకే మొదటి ప్రజా సదస్సు అట్టహాసంగా ముగిసింది. 2008లో తిరుపతిలో జరిగిన పార్టీ స్థాపక సమావేశంలో డిజిటల్, ఎలక్ట్రానిక్ టెక్నాలజీల సాయంతో 'ప్రజారాజ్యం పార్టీ' పేరును తెలుగు మెగాస్టార్ కొణిదెల చిరంజీవి ఆవిష్కరించారు. మరో తెలుగు సినీ హీరో ఎన్టీ రామారావు మాత్రం 1982లో తెలుగుదేశం పార్టీ ప్రారంభ సమావేశాన్ని ఎలాంటి ఆర్భాటం లేకుండా సాదాసీదాగా నిర్వహించి, 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించారు. అన్ని పార్టీలూ టీడీపీ కావు కదా! తమిళనాట ఎందరో హీరోలు స్థాపించిన అనేక ప్రాంతీయ పక్షాలు అంటుకు లేకుండాపోయాయి. తమిళనాడులో ఒక రాజకీయ పార్టీ స్థాపించడం ఎంత తేలిక అంటే తమిళ తీవ్ర వాద భావాలతో ఒక మోస్తరు పాపులారిటీ ఉన్న తమిళ నటుడు సీమన్ 2010లో శ్రీలంక అంతర్యుద్ధం ముగిశాక పెట్టిన 'నామ్ తమిళలార్ కచ్చి' (ఎన్‌టీకే) తన ఉనికిని ఫర వాలేదన్నట్టు కొనసాగిస్తోంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌టీకేకు 30 లక్షలకు పైగా (6.58%) ఓట్లు వచ్చాయి. సీమన్ కంటే ముందు తమిళ హీరోలు శరత్‌కుమార్, కార్తీక్ (తెలుగులో మురళీ) ప్రారంభించిన పార్టీలు ఇప్పుడు పత్తా లేకుండాపోయాయి. డీఎంకే నుంచి మొదట చీలిన వైగో (పాత పేరు వై.గోపాలసామి) పార్టీ ఎండీఎంకే కూడా తన ఉనికిని కాపాడుకోవడానికే పరిమితమైంది. డీఎంకే నేత, ఆ పార్టీ అధికారంలో ఉండగా స్పీకర్‌గా, కరుణానిధి కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన డాక్టర్ ఎం.తమిళకుడిమగన్ వంటి నేతలు స్థాపించిన అనేక పార్టీలు కాలగర్భంలో కలిసిపోయాయి. అయితే, రజనీకాంత్ మాదిరిగా 70 ఏండ్లు నిండిన తర్వాత కాకుండా ఐదు పదులు వచ్చాకే ఇప్పటికీ యాక్టివ్‌గానే కనిపించే విజయ్ తాజాగా కొత్త పార్టీని ప్రారంభించారు. సినిమా రంగంలో సంపాదించుకున్న ఆస్తులతో విజయ్ కూడా రజనీకాంత్ మాదిరిగానే ఆర్థికంగా ఇబ్బందిలేని స్థితిలో ఉన్నారు. 2021 తమిళ అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు తన పుట్టినరోజైన 2020 డిసెంబర్ 12న ప్రకటించి, ప్రారంభించిన పార్టీకి ఎన్నికల చిహ్నం (ఆటోరిక్షా) కూడా వచ్చిన తర్వాత ఎంఎస్‌కే జెండా పీకేసి ఎన్నికల రాజకీయాల్లోకి రానని రజనీకాంత్ ప్రకటించారు. వయసు, ఆరోగ్యం రీత్యా రజనీకాంత్‌కు ఉన్న ఇబ్బందులు విజయ్‌కు లేవు. అయితే, అనేక ఇతర సమస్యలు తమిళనాడు శాసనసభ మరుసటి ఎన్నికల లోపు (2026 వేసవి) టీవీకేను ఉక్కిరిబిక్కిరి చేసే అవకాశాలు నిండుగా కనిపిస్తున్నాయి.

> **ఈ సమస్యలను ఈ ఏడాదిన్నర కాలంలో విజయ్ తట్టుకుని నిలబడినా తమిళ ప్రజానీకం తమ దళపతిని ముఖ్యమంత్రి పీఠం ఎక్కిస్తారా? అంటే అది అంత తేలిక కాదని సునాయాసంగా చెప్పవచ్చు.**

మొదటి మహాసభలో విజయ్ ఎడాపెడా పంచ్ డైలాగులు, మాటల తూటాలు పెద్దగా పేల్చలేదు, విసరలేదు. కానీ, 'బీజేపీది ఫాసిజమైతే డీఎంకేది పాయసమా? బీజేపీ మాకు సైద్ధాంతిక శత్రువు అయితే డీఎంకే మా రాజకీయ ప్రత్యర్థి' అన్న విజయ్ మాటలు మాత్రం ప్రజలు, మీడియా, రాజకీయ విశ్లేషకుల దృష్టిని బాగా ఆకట్టుకున్నాయి. తోటి దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలో మాదిరిగా కేంద్రంలో పాలకపక్షమైన బీజేపీ తమిళనాడులో సీట్లు, ఓట్ల శాతంతో ఎదుగుతున్న జాతీయపక్షం కాదు. బీజేపీ తన 45 ఏండ్ల ప్రస్థానంలో తమిళనాట ఐదు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్న సందర్భాలు ఎప్పుడూ లేవు. అదీగాక తాము మతతత్వ వ్యతిరేక, లౌకిక పార్టీలమని చెప్పుకొనే పాలక, ప్రతిపక్ష ద్రావిడ పార్టీలు డీఎంకే, ఏఐఏడీఎంకే, పీఎంకే సహా అనేక చిన్నాచితకా పార్టీలు 1989 నుంచీ బీజేపీతో ఏదో ఒక ఎన్నికల్లో పొత్తుపెట్టుకుని, కూటమి కట్టినవే.

ఏ రాష్ట్రంలోనైనా, ఎవరైనా సరే కొత్తగా రాజకీయ పార్టీని ప్రారంభించారంటే.. అక్కడి పాలకపక్షంపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టాల్సిందే. అందుకే ఎంకే స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే ప్రభుత్వాన్ని అవినీతి నిండిన సర్కారుగా విజయ్ విమర్శించారు. అంతటితో ఆగకుండా కేంద్రంలోని హిందూత్వ పాలకపక్షం బీజేపీకి పెద్దగా హాని జరగని రీతిలో 'మతతత్వ, ఫాసిస్టు పార్టీ'గా దళపతి వర్ణించారు. గతంలో తాను నటించిన ఒక తమిళ సినిమాలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని, బీజేపీని ఎండగట్టే రీతిలో ఒక డైలాగ్ పలికినందుకు ఎదురైన అనుభవాల కారణంగా కాషాయపక్షాన్ని 'ఫాసిస్టు' అనే ధైర్యం విజయ్‌కి వచ్చిందనుకోవాలి. బీజేపీ ప్రధాన రాజకీయపక్షం కాని తమిళనాట ప్రధాని మోదీని, ఆర్ఎస్ఎస్ పరివారాన్ని ఎంతగా దుయ్యబట్టినా లేదా 1971 నుంచీ ఏదో ఒక ప్రధాన ద్రావిడ రాజకీయ పక్షం జూనియర్ భాగస్వామిగా ప్రతి ఎన్నికల్లో పోటీచేసి (రాజకీయాలు కన్నుమూసే వరకూ అర్థం కాని రాజీవ్‌గాంధీ హయాంలో జరిగిన ఒక్క 1989 అసెంబ్లీ ఎన్నికల్లో తప్ప) ప్రస్తుతం తమిళ పాలక కూటమిలో సేదదీరుతున్న కాంగ్రెస్‌ని దూషించినా టీవీకేకు చెప్పుకోదగిన సంఖ్యలో ఓట్లు రాలవు.

> **విజయ్ రాష్ట్ర కేబినెట్‌లో కనీసం మంత్రి కూడా కాలేరు. రాబోయే 16-18 మాసాల్లో కొత్త తమిళ ప్రాంతీయపక్షం ప్రజలకు ఇవ్వ జూపే గ్యారెంటీలు ఏమిటో, వాటిని జనం ముందు ఎలా పెడతారో అనే విషయాలే టీవీకే భవిత వ్యాన్ని నిర్ణయిస్తాయి.**

వయసు రీత్యా చూస్తే డీఎంకే వారసుడు, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.అన్నామలైల తరం వాడైన విజయ్ కూడా యువనేతగా కనిపిస్తారు. కానీ, ఇదొక్కటే శాసనసభ ఎన్నికల్లో కొత్త పార్టీకి అధికారం దక్కేలా చేయదు. మహా అయితే, దివంగత విజయకాంత్ పార్టీ డీఎండీకే 2011 ఎన్నికల్లో మాదిరిగా పాతిక ముప్పయి అసెంబ్లీ సీట్లు సంపాదించవచ్చు. 13 ఏళ్ల క్రితం జరిగిన ఈ ఎన్నికల్లో మాజీ సీఎం జయలలిత నేతృత్వంలోని ఏఐఏడీఎంకేతో పొత్తుపెట్టుకోబట్టే విజయకాంత్ పార్టీకి 29 సీట్లు వచ్చాయి.

ఎన్నికల్లో విజయం సాధిస్తే తన పార్టీకి మద్దతు పలికిన పార్టీలకు అధికారంలో వాటా ఇస్తాననే ప్రతిపాదన కూడా విజయ్ ప్రసంగంలో మరో కొత్త విషయం. నిజమే తమిళనాడు చరిత్రలో మొదటిసారి సంకీర్ణ సర్కారు ప్రథమ సార్వత్రిక ఎన్నికలు జరిగిన 1952లో (అప్పుడు రాష్ట్రం పేరు మద్రాస్) మాత్రమే కాంగ్రెస్ నేత సి.రాజగోపాలాచారి నాయకత్వాన ఏర్పడిన ప్రభుత్వం మిత్రపక్షాలకు మంత్రి పదవులు ఇచ్చింది. ఆ తర్వాత ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఏ ఒక్క ద్రావిడ పార్టీ కూడా జూనియర్ భాగస్వాములకు మంత్రి పదవులు ఇవ్వలేదు. అందుకే, 'మిత్రులకు సత్తాలో వాటా' అనే నినాదం విజయ్ ఎత్తుకున్నట్టు కనిపిస్తోంది. ఈ హామీ ఎన్ని చిన్నచిన్న పార్టీలను టీవీకే వైపునకు లాక్కొస్తుందో చూడాలి మరి. 'పుట్టినప్పుడు మానవులంతా సమానమే' అంటున్న మాట విజయ్‌ని ఫోర్ట్ సెయింట్ జార్జ్ అధికార పీఠానికి ఎంత దగ్గరకు తీసుకెళ్తుందో త్వరలో తేలిపోతుంది.

ఇదిగో.. జమిలికి ప్రత్యామ్నాయం

వంశీకృష్ణ జోషి
99494 30918

ప్రధాని మోదీ 2019 నుంచి పూర్తిస్థాయిలో దృష్టిపెట్టిన అంశమేదైనా ఉందంటే అది జమిలి మాత్రమేనని చెప్పవచ్చు. 2022లోనే జమిలి ఎన్నికల ప్రక్రియ ఆచరణలోకి రావాల్సి ఉన్నప్పటికీ, కరోనా కారణంగా అది వాయిదా పడింది. అంతేకాదు, ఆ సమయంలో సాహసం చేయడం మోదీకి ఇష్టం లేకపోవడంతోనే 2024 సార్వత్రిక ఎన్నికలు సాధారణంగా జరిగాయి. 2024 తర్వాత కార్యాచరణ మొదలుపెట్టడానికి వీలుగా ఎన్నికలకు ఒక ఏడాది ముందుగా ఆగమేఘాల మీద జమిలిపై కేంద్రం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో దాన్ని ఓ ప్రచారాంశంగా మార్చేసింది. ఒకవేళ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ భారీ మెజారిటీ సాధించి ఉంటే దాన్ని జమిలికి ప్రజామోదంగా ప్రచారం చేసుకునేవారు. అంతేకాదు, ఈ పాటికే ఆ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందేది. కానీ, మోదీ, బీజేపీ అనుకున్నది జరగలేదు.

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగలడంతో ఇంకో టర్మ్ వరకు ప్రధాని మోదీ.. జమిలి ఊసెత్తరని రాజకీయ పండితులు భావించారు. అసలు అది అసాధ్యమని, కేవలం ఎన్నికల స్టంటేనని కొంతమంది మేధావులు గతంలో వాదించారు. గత పదేండ్లలో నినాదాలు, ఆశయాలు, లక్ష్యాల గురించి ప్రస్తావించిన మోదీ తర్వాతి కాలంలో వాటిని మర్చిపోవడమే దానికి కారణం. అయితే, అందుకు భిన్నంగా మళ్లీ జమిలి అంశాన్ని మోదీ సర్కార్ తెరపైకి తీసుకొచ్చింది. ఇప్పటికే అమల్లో ఉన్న ల్యాటరల్ ఎంట్రీ లాంటి పార్లమెంట్ ఆమోదం అవసరం లేని చిన్న అంశాన్ని కూడా మోదీ సర్కార్ వెనక్కి తీసుకున్నది. కానీ, మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన జమిలి విషయంలో మాత్రం ప్రధాని వెనక్కి తగ్గకపోవడం ఇప్పుడు అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నది. తన ప్రభుత్వ ప్రతిష్ఠను పణంగా పెట్టి మరీ మరోసారి ఆయన 'జమిలి'పై స్వారీ చేస్తున్నారు. అది కూడా సొంత మెజారిటీ లేని సమయంలో కావడం మరింత విస్మయం కలిగిస్తున్నది. ఈ విషయాన్ని మోదీ ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

జమిలి చుట్టూ అనేక వివాదాలున్నాయి. జమిలి వల్ల జాతీయ అంశాలు తెరపైకివచ్చి, స్థానిక అంశాలు వెనకతట్టు పట్టి.. ప్రాంతీయ పార్టీలకు, ఫెడరలిజానికి తీరని నష్టం జరుగుతుందనేది వాటిలో ఒక వాదన. స్థానిక సమస్యలు, ప్రాంతీయ అంశాలకే ప్రజలు అధిక ప్రాధాన్యమిస్తారని, అందువల్ల జాతీయ పార్టీల కంటే ప్రాంతీయ పార్టీలకే లాభం చేకూరుతుందనేది మరో వాదన. ఈ వాదనలు ఎంతసేపటికీ ఎవరికి లాభం, ఎవరికి నష్టం చుట్టూనే తిరుగుతున్నాయి. ఈ సంకుచిత పరిధిని దాటి ఆలోచించడానికి ఎవరూ సిద్ధంగా లేరు. చివరకు ప్రాంతీయ పార్టీలు కూడా. చర్చంతా ముఖ్యంగా మొదటి వాదన మీదనే నడుస్తున్నది. అయితే, ఎవరికి మోదం, ఎవరికి ఖేదం అనేది కాలమే సమాధానం చెప్తుంది.

జమిలి వల్ల లాభాలున్నట్టే, నష్టాలూ ఉన్నాయనడంలో ఎలాంటి సంశయం లేదు. ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం మధ్యలోనే కుప్పకూలితే పరిస్థితి ఏమిటన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకమే. ఒకవేళ మధ్యంతర ఎన్నికలు జరిగి, మరో ప్రభుత్వం ఏర్పడితే దానికి రాజ్యాంగబద్ధంగా ఉండాల్సిన ఐదేండ్ల పదవీకాలం కాకుండా, కేంద్ర ప్రభుత్వ కాలవ్యవధిలో మిగిలిన సంవత్సరాలకు మాత్రమే కొత్త రాష్ట్ర ప్రభుత్వం మనుగడ సాగించాల్సి ఉంటుంది. ఇది రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధం. ఎంతో కీలకమైన ఈ అంశం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. అస్థిర ప్రభుత్వాల పోకడ, రాష్ట్రాల దీర్ఘకాలిక వ్యూహాలు, ప్రజాస్వామ్యానికి జరిగే నష్టం గురించి కూడా ఎవరూ చర్చించడం లేదు. తక్కువ కాలం పనిచేసే ప్రభుత్వాల వల్ల మేలు కంటే కీడే ఎక్కువ. పరిణతి లేని ప్రజాస్వామ్యంలో అడ్డూఅదుపు లేని అధికారం ఎంతటివారినైనా మత్తులో ముంచుతుంది. అదే సమయంలో నిరంతర ఎన్నికల కోడ్, వ్యయం, వనరుల పొదుపు గురించి కూడా ఆలోచించాల్సిందే. అయితే, వీటిని సమన్వయం చేసుకోవడమెలా అన్న చర్చ ఎక్కడా జరగడం లేదు.

అయితే, దీనికి మేలైన ప్రత్యామ్నాయం ఉన్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పనిచేస్తూనే, రాజ్యాంగ సవరణ కూడా అవసరం లేకుండా క్రమబద్ధంగా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నది. అదెలాగంటే, రాజ్యాంగం ప్రకారం ఏదైనా చట్టసభలో ఒక స్థానం ఖాళీ అయితే విధిగా, గరిష్ఠంగా ఆరు నెలల్లోనే ఎన్నికలు నిర్వహించాలి. ఇది రాజ్యాంగం ఇచ్చిన వెసులుబాటు. కాబట్టి, ఎప్పుడు పడితే అప్పుడు ఎన్నికలు నిర్వహించకుండా, ఆరు నెలల కాల వ్యవధి మించకుండా సంవత్సరంలో రెండుసార్లు మాత్రమే ఎన్నికలు నిర్వహించుకోవచ్చు. అందుకు జనవరి-జూలై, లేదా ఫిబ్రవరి-ఆగస్టు, జూన్- డిసెంబర్ అత్యంత అనుకూలం. ఇందుకు అతి తక్కువ పండుగలున్న నెలలను ఎంచుకోవాలి. ఆయా నెలలో రెండు వరుస సెలవులు ఉన్న సమయాన్ని చూసుకోవాలి. ఉదాహరణకు జనవరిలో రెండవ ఆదివారం, జూలైలో రెండవ ఆదివారం నేషనల్ ఎలక్షన్ల డేస్‌గా ప్రకటించి, యావత్ దేశంలో అన్ని రకాల ఎన్నికలు ఆ రోజుల్లో మాత్రమే నిర్వహించేలా చూసుకోవాలి. దానికి మూడు వారాల ముందు దేశవ్యాప్తంగా ఎన్నికల నోటిఫికేషన్లు విడుదల చేయాలి. నామినేషన్ల అనంతరం 10 రోజుల పాటు ప్రచారానికి సమయమివ్వాలి. అనంతరం ఆ నెల రెండో శనివారం, ఆదివారం నాడు దేశవ్యాప్తంగా ఒకేసారి పోలింగ్ నిర్వహించాలి. ఒక వారం రోజులు రిజర్వుగా గుర్తించి, నాలుగో ఆదివారం నాడు ఫలితాలు విడుదల చేయాలి. ఆ విధంగా చేసినట్టయితే 52 వారాలు నిరంతరంగా ఉండే ఎన్నికల రణగొణ ధ్వనిని దాదాపు ఏడాదిలో (3+3) ఆరు వారాలకు తగ్గించవచ్చు.

> **ప్రత్యేకంగా సెలవులు ప్రకటించాల్సిన అవసరమూ ఉండదు. తద్వారా పని దినాలను, ప్రభుత్వ వనరులను ఆదా చేయవచ్చు. ఎవరైనా సభ్యుడు మరణిస్తే అతని స్థానం తర్వాతి ఎన్నికల సైకిల్‌లో భర్తీ అవుతుంది. ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతే తర్వాతి సైకిల్‌లో ఎన్నికలు జరుగుతాయి. ఆరు నెలల్లోనే కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇందుకోసం రాజ్యాంగ సవరణలు చేయాల్సిన అవసరం కూడా ఉండదు.**

వనరుల దుర్వినియోగం, నిరంతర ఎన్నికల కోడ్‌ను నివారించడం, డబ్బు, సమయం ఆదా కోసం ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఒకవైపు బీజేపీ చెప్తున్న ఎన్నికల కోడ్, అధిక వ్యయం లాంటి అంశాలకు పరిష్కారాన్ని చూపుతూ, ఏ పార్టీకి లబ్ధి లేదా నష్టం చేయని ఈ విధానానికి ప్రాంతీయ పార్టీలు మద్దతు పలకాలి. దీన్ని ప్రజల ముందు చర్చకు పెట్టి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

> **జమిలికి మేలైన ప్రత్యామ్నాయం ఉన్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పనిచేస్తూనే, రాజ్యాంగ సవరణ కూడా అవసరం లేకుండా క్రమబద్ధంగా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నది. అదెలాగంటే, రాజ్యాంగం ప్రకారం ఏదైనా చట్టసభలో ఒక స్థానం ఖాళీ అయితే విధిగా, గరిష్ఠంగా ఆరు నెలల్లోనే ఎన్నికలు నిర్వహించాలి. ఇది రాజ్యాంగం ఇచ్చిన వెసులుబాటు. కాబట్టి, ఎప్పుడు పడితే అప్పుడు ఎన్నికలు నిర్వహించకుండా, ఆరు నెలల కాల వ్యవధి మించకుండా సంవత్సరంలో రెండుసార్లు మాత్రమే ఎన్నికలు నిర్వహించుకోవచ్చు. అందుకు జనవరి-జూలై, లేదా ఫిబ్రవరి-ఆగస్టు, జూన్- డిసెంబర్ అత్యంత అనుకూలం.**



ఉగ్రదాడుల వెనుక కుట్ర!

జమ్మూకశ్మీర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరి నప్పటి నుంచి వరుసగా ఉగ్ర దాడులు జరుగుతున్నాయి. ఒమర్ అబ్దుల్లా సర్కార్‌ను అస్థిరపరిచేందుకు దాడులు చేయిస్తున్నట్టు అనుమానంగా ఉన్నది. ఉగ్రవాదులను చంపకుండా వారిని ప్రాణాలతోనే పట్టుకో వాలి. అప్పుడే, వారి వెనుక ఎవరున్నారనే విషయం తెలు స్తుంది. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ఏదైనా ఏజెన్సీ పని చేస్తుందేమోనన్న కోణంలో కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టాలె.

-ఫరూక్ అబ్దుల్లా, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం

చెరిపేస్తే చెరిగిపోవడానికి తెలంగాణతో కేసీఆర్‌కు ఉన్నది రాజకీయ బంధం కాదు, అది పేగు బంధం. ఆయన కత్తుల వంతెన మీద కవాతు చేసి, నాలుగు కోట్ల ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. అంతేకాదు, పసిగుడ్డు అయిన తెలంగాణను కేవలం పదేండ్లలోనే సంక్షేమం, అభివృద్ధిలో పరుగులు పెట్టించారు.

చెరపలేని సంతకం కేసీఆర్

నరేష్ పాపట్ల
95054 75431

ఘన చరిత్ర కలిగిన... 'కేసీఆర్‌ను ఫినిష్ చేశాను, ఇక కల్వకుంట్ల కుటుంబం ఉనికి లేకుండా చేయడమే తన లక్ష్యం' అంటూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అహంకార పాన్పుపై పగటి కలలు కంటున్నారు. సుమారు 11 నెలల్లోనే అట్టర్ ఫ్లాప్ సీఎంగా ముద్ర వేసుకున్న చరిత్ర రేవంత్‌ది. పేర్ల మార్పు, ఇండ్ల కూల్చివేతతో పాటు యూట్యూబ్ ఛానళ్ల ద్వారా అబద్ధాలను ప్రచారం చేయించగలరేమో కానీ, తెలంగాణ పుడమిపై సువర్ణాక్షరాలతో లిఖించబడిన కేసీఆర్ అనే మూడు అక్షరాలను చెరిపివేయడం ఎవరివల్లా కాదు. ఆయనే లేకుంటే భారతదేశ చిత్రపటంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించేదా? రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యేవాడా?

బీఆర్ఎస్ సంక్షేమ పథకాల కొనసాగింపుతో పాటు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అదనంగా అమలవుతాయని నమ్మిన ప్రజలు కేవలం 2.05 శాతం తేడాతో కాంగ్రెస్ పార్టీకి పాలనా పగ్గాలు అప్పగించారు. గౌరవ ప్రదమైన సీట్లను గెలిపించి బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదాను కట్టబెట్టారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ఒక్క ఓటమితో బీఆర్ఎస్ ఇక ఉండదని ప్రచారం కొనసాగిస్తుండటం అజ్ఞానమవుతుంది. అలా అయితే, దేశవ్యాప్తంగా వరుసగా ఎదురవుతున్న కాంగ్రెస్ పరాభవాలను ఏమంటారో? 'ముఖ్యమంత్రులు ఎంతో మంది వస్తుంటారు, పోతుంటారు.' పాలనాదక్షులకు మాత్రమే చరిత్రలో స్థానం ఉంటుంది. ఆ స్థానాన్ని సంపాదించుకున్నవారే కేసీఆర్.

ఉమ్మడి పాలనలో విధ్వంసమైన తెలంగాణకు దశాబ్ద కాలంలోనే పురోగతి దారిచూపిన దార్శనికుడు కేసీఆర్. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ సంక్షేమ, అభివృద్ధి నమూనాను తెలపకపోగా, 'లంకె బిందెలనుకొని వస్తే.. ఖాళీ కుండలే కనిపిస్తున్నాయి' అని వ్యాఖ్యానించడం ఆయన పాలనా అపరిపక్వతకు నిదర్శనం. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామన్న హామీలను అటకెక్కించాడు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల నిర్మాణం, రైతుబంధు, రైతుబీమా, నాణ్యమైన ఉచిత కరెంటు, మెరుగైన విత్తనాలు, ఎరువుల సరఫరాతో బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చింది. కరువు నేల పాలమూరును పచ్చని మాగాణంలా మార్చింది. స్వల్పకాలంలోనే తెలంగాణ దేశానికే అన్నపూర్ణగా ఎదిగింది. హస్తం పాలకుల పుణ్యమాని ఇప్పుడు ఆంక్షల అడ్డుగోడలతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది వాస్తవం కదా? కేసీఆర్ పదేండ్ల పాలనలో సర్వమతాలకు సముచిత గౌరవం దక్కింది. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం మహాద్భుతం అంటూ భక్తులు కేసీఆర్‌ను ప్రశంసిస్తున్నారు. పల్లెల్లో ఇప్పుడెందుకు పండుగలకు ప్రభుత్వ కానుకలు అందడం లేదు. వేల ఏండ్ల వెలివాడల వెతలు తీర్చేందుకు కేసీఆర్ దళితబంధు వంటి విప్లవాత్మక పథకానికి శ్రీకారం చుట్టి వెలుగు నింపారు. హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పి ఆత్మగౌరవ పతాక ఎగురవేశారు. ఇదిలా ఉంటే రేవంత్ పాలనలో హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో నిమ్నవర్గాలకు చెందిన నిరుపేదల ఇండ్లను కూల్చివేయడం అమానుషం.

తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటు ఎవరి మెప్పు కోసం? మొన్నటివరకు ఆనందంగా ఉన్న గురుకులాల విద్యార్థులు ఇప్పుడెందుకు గోస పడుతున్నారు? కేసీఆర్ పాలనలో ప్రభుత్వరంగంలో 1.60 లక్షల ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో 24 లక్షల ఉద్యోగాలు భర్తీ అయ్యాయి. కాంగ్రెస్ మాత్రం విద్యార్థి, నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకోలేకపోతున్నది. ఐటీ రంగాన్ని మేటిగా తీర్చిదిద్దిన బీఆర్ఎస్‌ను యువత ఇప్పటికీ కొనియాడుతున్నది. మొన్నటివరకు తెలంగాణలో 'మూడు పువ్వులు ఆరు కాయలు'గా వర్ధిల్లిన రియల్ వ్యాపారం కుదేలవ్వడానికి కారకులెవరో తెలంగాణ సమాజానికి తెలువదా?

11 నెలల వ్యవధిలోనే ఢిల్లీకి 25 సార్లు పర్యటనలు చేశాడంటే తెలంగాణ ప్రభుత్వ పగ్గాలు ఎవరి చేతుల్లో ఉన్నాయో తెలిసిపోతున్నది. కేసీఆర్ పదవిలో ఉన్నప్పుడు నోరు మెదపని పొరుగు రాష్ట్రం నేతలు మళ్లీ ఇప్పుడెందుకు తెలంగాణలో పునరుజ్జీవ రాజకీయాలు మొదలు పెట్టాలనుకుంటున్నారో విద్యార్థి, మేధావివర్గం తప్పక ఆలోచించాలి. ఉద్యమ నేపథ్యం కలిగిన వారి భాగస్వామ్యం ఓర్చుకోలేక 'కుటుంబ పాలన' అంటూ కాంగ్రెస్ కుటిల రాజకీయం చేసింది. ఇప్పుడు 'ప్రజా పాలన' పేరిట ఆ నాలుగు కుటుంబాలు చేస్తున్న కుటుంబాల పాలనను చైతన్యవంతమైన తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

> **తెలంగాణలో శాంతిభద్రతలు కొరవడి, ఎమర్జెన్సీ రోజులు తలపిస్తున్నాయి. రక్షణగా నిలవాల్సిన పోలీసులే న్యాయం కోసం 'రోడ్డెక్కారంటే 'ప్రజా పాలన'లో పోలీసుల పరిస్థితి ఏ విధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సీఎం రేవంత్ డైవర్షన్ పాలి'ట్రిక్స్' చేస్తున్నాడు.**

'నిజం గడప దాటేలోపు అబద్ధం ప్రపంచం చుట్టి వస్తుంద'న్నట్టుగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పొలిటికల్ టూరిస్టుల కనికట్టు విద్యలు, స్థానిక హస్తం నేతల మాయల హామీలను నమ్మి నీతిగల్ల తెలంగాణ సమాజం మోసానికి గురైంది. కేసీఆర్ అంటేనే ఒక చరిత్ర. ఆయన ముందు రేవంత్‌రెడ్డి ఎంత? 'మళ్లీ కేసీఆరే సీఎం కావాలి' అన్న నినాదాలు తెలంగాణలో ఊపందుకున్